క్లుప్తంగా

జగనన్న స్థలాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం



మాకవరపాలెంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్

మాకవరపాలెం: జగనన్న కాలనీల్లో పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. శుక్రవారం నుంచి సచివాలయాల్లో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియను తహసీల్దార్ మురళీమోహనరావు పర్యవేక్షించారు. త్వరితగతిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి సూచించారు. లబ్ధిదారులు నిర్లక్ష్యం చేయకుండా ఆధార్‌కార్డు, స్థల పట్టా కాపీలతో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శంకర్, ఈవో సుదర్శనరావు, వీఆర్వో సూర్యనారాయణ పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



సీఐతో సన్యాసిపాత్రుడు, పార్టీ నాయకులు

నర్సీపట్నం: టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన కాంతికుమార్‌ను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, పార్టీ నాయకుడు కర్రి రామ్‌గోపాల్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్థిక మోసాలపై అవగాహన



కళా బృందం ప్రదర్శన

మాకవరపాలెం: స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు కళాజాతా ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాతా సభ్యులు ప్రస్తుత సమాజంలో ఏవిధంగా ఆర్థిక మోసాలు జరుగుతున్నాయో వివరించారు. చాప చుట్టేసే చిట్ ఫండ్ కంపెనీల మోసాలపై కళారూపంలో తెలియజేశారు. ఎస్‌బీఐ అకౌంటెంట్ మహేంద్ర కుమార్, క్యాషియర్ రామ్‌గణేష్ పాల్గొన్నారు.

ఉత్తమ డీఈఈకి ఘన సత్కారం



డీఈఈ గౌరీశంకర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

చోడవరం: ఉత్తమ అవార్డు గ్రహీత ఎలక్ట్రికల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యు.గౌరీశంకర్‌ను ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా గౌరీశంకర్‌కు ఉత్తమ సేవా అవార్డు వచ్చింది. వెంకన్నపాలెం సబ్ స్టేషన్ ఆవరణంలో ఆయన్ను ఉద్యోగులంతా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఈఈ పి. చెల్లిబాబు, ఏఈలు ఉదయ్ కుమార్, రాజు, ఎల్ఐలు సింగపల్లి రవికుమార్, వేపాడ సత్యనారాయణ, ప్రేమ చంద్రశేఖర్, యుగంధర్ పాల్గొన్నారు.

నేడు లయన్స్ క్లబ్ సేవా మహోత్సవం



మాట్లాడుతున్న క్లబ్ పాస్ట్ చైర్మన్ వర్మ

నర్సీపట్నం: బలిఘట్టంలో లయన్స్ క్లబ్ సేవా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని క్లబ్ పాస్ట్ చైర్మన్ వర్మ శుక్రవారం కోరారు. నర్సీపట్నం శాఖ ఆధ్వర్యంలో రూ.35 లక్షల విలువ గల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ సేవా కార్యక్రమాలపై ఆసక్తితో లయన్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ మూర్ విచ్చేస్తున్నారన్నారు. సమావేశంలో క్లబ్ ప్రతినిధులు చింతకాయల సన్యాసిపాత్రుడు, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎ.గోపాలరావు, పాస్ట్ గవర్నర్ డి.రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- కె.కోటపాడులో రూ.9.59 కోట్లతో పూర్తయిన పనులు ప్రారంభం



కోనేరుకు సీసీ రోడ్డు, అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



సచివాలయ ప్రారంభోత్సవానికి రిబ్బన్ కట్ చేస్తున్న అనురాధ, అరుణ, భవాని



నాడు-నేడు అభివృద్ధి పనులను విద్యార్థులతో కలిసి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

కె.కోటపాడు: సీఎం జగన్ పాలనలో అన్ని గ్రామాల సర్వతోముఖాభివృద్ధి ధ్యేయంగా పనులు చేస్తున్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. శుక్రవారం కె.కోటపాడులో రూ.9.59 కోట్లతో పనులు పూర్తి చేసుకున్న 11 అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతోపాటు శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. కె.కోటపాడులో రూ.5.60 కోట్లతో నిర్మించిన సీహెచ్‌సీ అదనపు భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో పట్టణాలతోపాటు గ్రామాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, సర్పంచ్ యర్రంశెట్టి భవాని, ఎంపీటీసీ బంగారి లక్ష్మి, ఎంపీడీవో పట్నాయక్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఏఈలు బాలాజీ అప్పారావు, చంద్రశేఖర్, నాయుడు, అల్లు శ్వేత, ఏపీఎం వెంకటలక్ష్మి, ఎంఈవోలు ప్రసాద్, సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్, శ్రీకాంత్ శ్రీను, వైఎస్సార్‌సీపీ యువజన, మహిళా విభాగం మండల అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, పైల అమ్మాజి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బండారు ముత్యాలనాయుడు, వంటాకు అప్పాజి, దొగ్గ ఉమాశంకర్, తత్రా శేషు, చీపురపల్లి అచ్చిబాబు, వర్రి రామునాయుడు, వంటాకు శ్రీను, ఆదిరెడ్డి రామునాయుడు, భూమిరెడ్డి దేముళ్లు, బోళెం కృష్ణారావు, నెక్కల గోపి, ద్వారపూడి శ్రీనివాస్, దోకల అప్పలనాయుడు, బర్ల రాము పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ల సొమ్ము అందజేత



నూకాలమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ నాగేశ్వరరావు



దేముడమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శాంతికుమారి

దేవరాపల్లి: మహిళా వలంటీర్ తాటిపూడి శాంతి కుమారి మానవత్వం చాటింది. విశాఖపట్నం కేజీహెచ్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న దేవరాపల్లికి చెందిన కొల్లి దేముడమ్మ, కొల్లి పోతురాజులకు పింఛన్ సొమ్ము అందజేసింది. ఆస్పత్రులో ఉన్న తమకు పింఛన్ సొమ్ము అందించి కొండంత సహాయం చేశారని పింఛన్‌దారులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా సేవా స్ఫూర్తితో పనిచేసిన వలంటీర్‌ను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, పంచాయతీ సెక్రటరీ ఎస్. శ్రీనివాసరావు అభినందించారు.

బుచ్చెయ్యపేట: విశాఖ కేజీహెచ్‌లో బర్ల నూకాలమ్మకు వితంతు పింఛన్ సొమ్మును వలంటీరు మిరియాల నాగేశ్వరరావు శుక్రవారం అందజేశారు. మండలం శివారు గ్రామం ఎం.బి.పాలేనికి చెందిన ఆమె పడిపోవడంతో కాలి విరిగిపోయి కొద్ది రోజులుగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఈ మేరకు తన సొంత ఖర్చులతో అక్కడకు వెళ్లి పింఛన్ ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేసింది.

చేతి బోరు ప్రారంభం



7వ వార్డులో చేతిబోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ గాడి కాసు

చోడవరం: పట్టణంలోని ఏడో వార్డు పరిధిలో మండల పరిషత్ నిధులతో నిర్మించిన చేతిబోరును ఎంపీపీ గాడి కాసు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా ఏళ్లుగా మంచినీటి కోసం పట్టణ ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని, విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కృషితో రూ.13 కోట్లతో మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసి ఇంటింటి కుళాయిలు ఇప్పటికే ఇచ్చామన్నారు. అత్యవసర నీటి అవసరాలు తీర్చేందుకు అవసరమైన చోట్ల మండల పరిషత్ నిధులతో చేతి బోర్లు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, ఎంపీటీసీ పాట్నూరి అరుణ, కేశవ స్వామి దేవస్థానం చైర్మన్ అలమండ ఈశ్వరరావు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

నాతవరం ఎంపీడీవో రాంబాబు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో జె.రాంబాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో సిబ్బందితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తాండవ నిర్వాసిత గ్రామం మాధవనగరంలో తాగునీటి సమస్య ఉందని తన దృష్టికి వచ్చిందన్నారు. అక్కడ రూ.4 లక్షలతో అదనపు పైపులైను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్ దృష్టి సారించాలన్నారు. మండల వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి గ్రామాల్లో చేతిపంపులు వేసేందుకు మండల పరిషత్ జనరల్ ఫండ్ నుంచి నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి సూచన మేరకు అదనంగా 12 బోర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పనులు ఈ నెలలోపు పూర్తి చేయాలన్నారు.

వీటితోపాటు జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. సచివాలయ పరిధిలో నూతన భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మకు సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, హౌసింగ్ జేఈ జోగారావు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

చీడికాడ: కోనాం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకటలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 10న పాఠశాలలో ఉంటుందన్నారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్‌కు సత్కారం

దేవరాపల్లి: తెనుగుపూడిలో గురుకుల పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కె.వి.ఎల్. నర్సింహరావును ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయ కర్త(డీసీవో) ఎస్. రూపావతి పాల్గొని రిటైర్డ్ ప్రిన్సిపాల్ సేవలను ప్రశంసించారు. ఎంఈవోలు బి.పడాల్‌దాస్, వి. ఉషారాణి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి సీఎం జగన్ లక్ష్యం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- గజపతినగరం, అంకుపాలెంలో నూతన భవనాల ప్రారంభం



గజపతినగరంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ కరణం ధర్మశ్రీ



అంకుపాలెంలో ఆర్బీకే, హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గజపతినగరం, అంకుపాలెంలో రూ.48 లక్షల చొప్పున గ్రామ సచివాలయ భవనాలు, రూ.26 లక్షల చొప్పున రైతు భరోసా కేంద్రాలు, రూ.18 లక్షల చొప్పున నిర్మించిన హెల్త్ సెంటర్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్య స్థాపనకు గ్రామాల అభివృద్ధి కోసం అన్ని విధాలుగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. కొత్తగా సచివాలయ వ్యవస్థతో పాటు అన్ని భవనాలు నిర్మించడం, శాఖలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బందిని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి ప్రజలు సకాలంలో సేవలందిస్తున్నామన్నారు. తద్వారా దేశంలో ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు పూర్తిగా మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు మళ్ల శ్రీనువాసరావు, నాగులాపల్లి రాంబాబు, ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీలు బుద్ద గంగరాజు, బైన ఈశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మండల ఉపాధ్యక్షుడు ముర్రోతు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ లబ్ధితో ప్రతి ఒక్కరి కళ్లలో ఆనందం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి

కె.కోటపాడు: సీఎం జగన్ సంక్షేమ పాలనలో ప్రతీ కుటుంబానికి మేలు కలిగిందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. కె.కోటపాడులో రెండో రోజు శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రెల్లిపేట, జంగాల, బీసీ కాలనీ, సినిమాహాల్ వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల చేకూరిన సంక్షేమ లబ్ధిని వివరించారు. వారు సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో పలువురు లబ్ధిదారులు తమ ఆనందాన్ని ఆయనతో పంచుకున్నారు. ఇంటికి పెద్ద దిక్కు లేకున్నా ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ తీసుకోవడం వల్ల ఆర్థిక ఇబ్బంది లేకుండా జీవనం సాగిస్తున్నట్లు గ్రామానికి చెందిన వై.లక్ష్మి ఆనందం వ్యక్తం చేసింది. తమ కుటుంబానికి వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నావడ్డీ, సామాజిక పింఛన్ వర్తింపుతో రూ.2.60 లక్షల లబ్ధి కలిగినట్లు భూపతి నారాయణరావు వివరించాడు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రెడ్డి అరుణ, శ్రీకాంత్ శ్రీను, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాల పండగ

- కొమరవోలు, కుసుర్లపూడిలో నూతన భవనాలు సిద్ధం
- నేడు హాజరు కానున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కొమరవోలులో నిర్మాణం పూర్తి చేసుకున్న ఆర్బీకే



ప్రారంభానికి సిద్ధమైన విలేజీ హెల్త్ క్లినిక్



కుసుర్లపూడిలో హెల్త్ క్లినిక్

రోలుగుంట: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండల కార్యాలయాల్లోని పలు శాఖల సేవలు గ్రామాల్లోనే అందుబాటులోకి వచ్చాయి. అందుకు తగ్గట్టుగా అధికారులకు, పల్లె ప్రజలకు అనువుగా ఉండే విధంగా కోట్లాది రూపాయలతో భవనాలు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా కొమరవోలులో రూ.25 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.20.8 లక్షలతో వైఎస్సార్ విలేజీ హెల్త్ క్లినిక్, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, కుసుర్లపూడిలో రూ.23.94 లక్షల ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతోను, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ (రైతు భరోసా)కేంద్రం, వైఎస్సార్ విలేజీ హెల్త్ క్లినిక్(భారత్ నిర్మాణ సేవా కేంద్రం) నిర్మాణం పూర్తయ్యాయని ఆయా గ్రామాల సర్పంచ్‌లు గొర్లె రమణమ్మ, మడ్డు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ దొరబాబు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల సేవలు తమ గ్రామాల్లోకే అందుబాటులోకి రావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు గొర్లె వెంకట రామన్ మాట్లాడుతూ అన్ని సచివాలయాల్లోను హెల్త్ విలేజీ క్లినిక్, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలు నిర్మించామన్నారు. శనివారం కొమరవోలు, కుసుర్లపూడి గ్రామాల్లో నూతన భవనాలను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభిస్తారన్నారు. మండలంలో అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నూతన తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



నర్సీపట్నం తహసీల్దార్ శ్రీరాములు



మాకవరపాలెం తహసీల్దార్ మురళీమోహనరావు



రావికమతం తహసీల్దారు రామారావు



చీడికాడ తహసీల్దార్ ప్రకాష్‌రావు



చీడికాడ ఎంపీడీవో రాజేశ్వరి



తహసీల్దార్ ఈశ్వరమ్మ



నాతవరంతహసీల్దార్‌గా రమేష్‌కుమార్



గొలుగొండ తహసీల్దార్ ప్రభాకరరాజు



దేవరాపల్లి తహసీల్దార్ లక్ష్మీనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న బుచ్చెయ్యపేట తహసీల్దార్ శ్రీకాంత్

కె.కోటపాడుకు ఈశ్వరమ్మ

కె.కోటపాడు: స్థానిక తహసీల్దార్‌గా జె.ఈశ్వరమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు కె.కోటపాడులో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు.

రావికమతం తహసీల్దారుగా రామారావు

రావికమతం: స్థానిక తహసీల్దారుగా ఎస్.రామారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన మహేశ్వరరావు శ్రీకాకుళం బదిలీ అయ్యారు. బూర్జ మండల తహసీల్దారుగా పనిచేస్తున్న రామారావును ఇక్కడ నియమించారు.

గొలుగొండ తహసీల్దార్‌గా ప్రభాకరరాజు

గొలుగొండ: స్థానిక తహసీల్దార్ ప్రభాకరరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ ఆనందరావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

మాకవరపాలెం తహసీల్దార్‌గా మురళీమోహనరావు

మాకవరపాలెం: స్థానిక తహసీల్దార్‌గా మురళీమోహనరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ప్రసాద్‌ను ఎన్నికల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో అదే జిల్లా హిర మండలం తహసీల్దార్ మురళీమోహనరావును నియమించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన విధుల్లో చేరారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

నర్సీపట్నం తహసీల్దార్‌గా శ్రీరాములు

నర్సీపట్నం: స్థానిక తహసీల్దార్‌గా శ్రీరాములు బాధ్యతలు చేపట్టారు. ఇతను ఉమ్మడి విశాఖలో రాంబిల్లి, పెదబయలు తహసీల్దార్‌గా పని చేశారు. శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చి ప్రస్తుత ఇన్‌చార్జి తహసీల్దార్ అన్నాజీరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

దేవరాపల్లి తహసీల్దార్‌గా లక్ష్మీనారాయణ

దేవరాపల్లి: తహసీల్దార్‌గా జి. లక్ష్మీనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్ ఎం. లక్ష్మి శ్రీకాకుళం బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో చేరిన లక్ష్మీనారాయణకు డిప్యూటీ తహసీల్దార్ ఎస్. సురేష్, ఆర్ఐ ఎన్.సతీష్, వీఆర్వోలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చీడికాడ తహసీల్దారు, ఎంపీడీవోల బాధ్యతలు

చీడికాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ బి.వి.రాణి, ఎంపీడీవో జయప్రకాష్ ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో నూతన తహసీల్దార్‌గా బి.ప్రకాష్‌రావు, ఎంపీడీవోగా జె.రాజేశ్వరి శుక్రవారం విధుల్లో చేరారు. శ్రీకాకుళం కలెక్టరేట్ నుంచి తహసీల్దారు, మన్యం పార్వతీపురం జిల్లా పాలకొండ నుంచి ఎంపీడీవో బదిలీపై ఇక్కడకు వచ్చారు.

బుచ్చెయ్యపేట తహసీల్దార్‌గా శ్రీకాంత్

బుచ్చెయ్యపేట: తహసీల్దార్‌గా కె. శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ తహసీల్దార్ వెంకటేశ్వరరావు నాలుగు నెలల క్రితం వీఆర్ ఇవ్వడంతో డీటీ అరుణ్‌చంద్ర ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగారు. వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సుధాకర్, రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నాతవరం తహసీల్దార్‌గా రమేష్‌కుమార్

నాతవరం: స్థానిక తహసీల్దార్‌గా ఎస్. రమేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు శ్రీకాకుళం జిల్లా పలాసకు బదిలీ అయ్యారు. అక్కడ గెయిల్‌లో స్పెషల్ తహసీల్దార్‌గా పని చేస్తున్న రమేష్‌కుమార్‌కు ఇక్కడకు వచ్చారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు



సేవలను ప్రారంభిస్తున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ: జైతవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచ్ కోడూరి సత్యవతి శుక్రవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో చీడికాడ, పెదగోగాడ వైద్య సిబ్బందితోపాటు ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు 186 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు ఇచ్చారు. ఎంపీడీవో జె.రాజేశ్వరి, ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య, పంచాయతీ కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

రోలుగుంట: బుచ్చింపేట పీహెచ్‌సీ పరిధిలో కొంతలంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సర్పంచ్ కుంచంగి వంశీ శుక్రవారం ప్రారంభించారు. 315 మంది రోగులకు వైద్య నిపుణలు శ్రీనివాసరాజు(జనరల్), అనీషా(గైనకాలజిస్ట్), అభిరామ్ (సర్జన్), అరుణ పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కె.కోటపాడు: రొంగలినాయుడుపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి పర్యవేక్షించారు. ఈ శిబిరంలో 326 మంది రోగులను చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల, ఆర్థోపెడిక్ నందకిషోర్, కంటి వైద్యుడు రాజీవ్ పరీక్షించి ఉచితంగా మందులను ఇచ్చారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కిశోర్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, సర్పంచ్ పైల పైడితల్లమ్మ, ఎంపీటీసీ గొర్రుపోటు రామలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి భీమరాజు పాల్గొన్నారు.

నాతవరం: మన్యపురట్ల సచివాలయంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీడీవో జె.రాంబాబు శుక్రవారం పరిశీలించారు. గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారులు అనూష, జి.లలిత, పి.ఆదిత్య, సోమేశ్వరరెడ్డి రోగులను పరీక్షించి మందులు ఇచ్చారు. ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు, గునుపూడి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.